ప్రజాశక్తి

శుక్రవారం 16 డిసెంబర్ 2022 5

పార్వతీపురం మన్యం



చిరుద్యోగులపై పని భారం తగదు : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్

చిరు ఉద్యోగులపై పనిభారం పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నట్టు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు తెలిపారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాసమస్యలు ఏవీ లేనట్టు కార్మిక, ఉద్యోగులపై వేధింపులో భాగంగా సర్క్యులర్లు, మెమోలు జారీ చేయడం రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక వైఖరిని చాటుకుంటుందన్నారు. మక్కువ మండలంలో ఆత్మహత్య చేసుకున్న విఆర్ఓ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం దాడిచేసి నేడు చిరుద్యోగులపై సర్క్యులర్ పని భారం పెంచి వారిని మానసికవేదనకు గురి చేస్తుందని విమర్శించారు. కావున రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు, మొండి వైఖరికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు జి.వెంకటరమణ, బంటు దాసు పాల్గొన్నారు.

నిరుపయోగంగా డ్రెయిన్ల నిర్మాణం



నాసిరకంగా జరుగుతున్న కాలువ పనులు

- నాసిరకంగా పనులు
- వృధాగా ప్రజాధనం

ప్రజాశక్తి-పాలకొండ

నగర పంచాయతీలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే కొన్ని ప్రాంతాల్లో అవసరం లేనప్పటికీ అక్కడ లక్షల రూపాయలు ఖర్చుచేసి కాలువలు, రోడ్లు నిర్మిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అవసరమైన చోట రూపాయి కూడా ఖర్చుచేయకుండా ఉన్న కాలువలు తొలగించి లక్షలాది రూపాయలు ఖర్చుచేయడం పట్ల స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం పట్టణంలో మెగిలివీధి కాలువల నిర్మాణం. 1500 మీటర్ల కాలువకు రూ.18 లక్షల నిధులు కేటాయించారు. అయితే సుమారు 700 మీటర్ల వరకు కాలువ పక్కాగా ఉన్నప్పటికీ దాన్ని తొలగించి నిధులు దుబారా చేస్తున్నారని స్థానికుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. దీనివల్ల స్థానికులకు మరింత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరించి కాలువల్లో ఉన్న పైపులైన్లు తొలగించి స్థానికులను ఇబ్బందులకు గురిచేయడం పట్ల వారి నుంచి అసంతృప్తి జ్వాలలు వినిపిస్తున్నాయి. అసలు ఇక్కడ కాలువ పనులు అవసరమా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నాసిరకంగా పనులు...

పట్టణంలో జరుగుతున్న కాలువ పనులు కూడా నాసిరకంగా కనిపిస్తున్నాయి. రూ.18 లక్షలు ఖర్చు చేస్తున్నప్పటికీ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పూర్తిగా అక్కడ ఉన్న మట్టి, రాళ్లతోనే నిర్మాణం జరుగుతుంది. సిమెంట్ తగిన మోతాదులో వినియోగించకపోవడంతో పనులు నాసిరకంగా జరుగుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీన్ని పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లకు నచ్చినట్టు పనులు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలపై గళం వినిపిస్తాం

పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

ప్రజాశక్తి - భామిని

ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇతర రంగాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చట్టసభలో వినిపిస్తామని పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ అన్నారు. ఈ ఎన్నికల ద్వారా సంఘాల ఐక్యత, బలం నిరూపించుకోవలసిన బాధ్యత మనపై ఉందని అన్నారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాల, జూనియర్ కాలేజీ, కెజిబివి, అంబేద్కర్ గురుకులం ఉపాధ్యాయుల సమస్యలు, పలు అంశాల పై సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హక్కులకై ప్రశ్నించే వ్యవస్థలపై ఉక్కుపాదం మోపి అణిచివేస్తున్నారని, ప్రవేటీకరణ పేరుతో కేంద్రం ప్రభుత్వం ఆస్తులు అమ్ముతుంటే రాష్ట్రంలో ప్రశ్నించే పరిస్థితి లేదని అన్నారు. ప్రభుత్వంలోకి రాక ముందు అందరూ ఉద్యోగులనూ రెగ్యులర్ చేస్తామని చెప్పి ఇప్పుడు చాప కింద నీరులా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తొలిగింపునకు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులకు ఇచ్చిన సిపిఎస్ రద్దు గాలికి వదిలేసారని, రాష్ట్రానికి ప్రేత్యేక హోదా గురించి మాట్లాడే పరిస్థితి లేదని, ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయవలసిన గిరిజన యూనివర్సిటీ, రైల్వే జోన్, సుజల ప్రవంతి, పెట్రోలియం యూనివర్సిటీ పూర్తిగా మరిచారాని అన్నారు. మేధావులు సభకు మేధావులు రావాలి గాని, రాజకీయ నాయకులు వస్తున్నారని, 250 సంఘాలు తనను పీడీఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థిగా నిలబెట్టారని, ఈ ఎంఎల్‌సి గెలుపు ద్వారా మన హక్కులు, సమస్యలు వాణి చట్టసభలోకి తీసుకెళ్లే బాధ్యత మనపై వుందని అన్నారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ దండు ప్రకాశరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

పని ఒత్తిడి వల్లే ఆత్మహత్య

పోలీసులకు విఆర్ఒ భార్య ఫిర్యాదు

సాలూరు రూరల్ : పని ఒత్తిడి వల్లే మండలంలోని మామిడిపల్లి విఆర్ఒ శంబంగి సంతోష్‌కుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని అతని భార్య శ్రీదేవి పోలీసుకు ఫిర్యాదు చేశారు. ఉద్యోగ రీత్యా విపరీతమైన ఒత్తిడితో ఉండేవారని, మానసికంగా బాధపడే వారని, ఈ ఉద్యోగం చేయడం తన వల్ల కాదని, ఏదైన ఉన్నత ఉద్యోగానికి ప్రయత్నం చేస్తానని, సెలవులు కావాలన్న అధికారులు మంజూరు చేయటం లేదని నిరంతరం బాధపడే వారని ఆమె కన్నీరుమున్నీరై విలపించింది. ఇదే విషయమై తోటి ఉద్యోగుల వద్ద ప్రస్తావించగా సంతోష్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, ఏ సమస్యనైనా సులువుగా తేల్చుకునేవాడని ఎప్పుడూ తాను చదివే చదువుకు ఈ ఉద్యోగం సరిపోదని తమ వద్ద ప్రస్తావించేవాడని తెలిపారు.

బాబు పాలనలో

ప్రజలు ఇదేం కర్మన్నారు

- వైసిపి ప్రభుత్వంపై సంతృప్తితో ఉన్నారు
- డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

మాజీ సిఎం చంద్రబాబునాయుడు పాలనలో ప్రజలు ఇదేం కర్మ అని భావించడంతోనే ఓడించారని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. గురువారం ఆయన వైసిపి నాయకులు మద్దిల గోవిందరావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంతవరకూ అర్హులైన వారికి పథకాలు అందకపోతే వారికి ఈనెల 27న సిఎం జగన్ రూ.400కోట్లతో ఆర్థిక లబ్ది చేకూర్చనున్నారని చెప్పారు. ఇందుకు సంబంధించి ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. ప్రజలు వైసిపి ప్రభుత్వంపై పూర్తి స్థాయిలో సంతృప్తిగా ఉన్నారని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి నుంచి పేదలకు పింఛను మొత్తాన్ని రూ.2750కు పెంచుతున్నట్లు చెప్పారు. గతంలో సిఎం జగన్ ఇచ్చిన హామీకి కట్టుబడి దశలవారీగా పింఛను మొత్తం రూ.3వేలకు పెంచుతున్నట్లు తెలిపారు. ఈనెల 21న రాష్ట్రంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో ఇళ్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రి లో అత్యవసర పరిస్థితుల్లో రోగులకు రక్తం కొరత ఎక్కువగా వుందని, చాలామంది ఫిర్యాదు చేశారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈనెల 21న సిఎం జగన్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలోని శివాలయం వీధిలో గల సీతారామ ధర్మశాలలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులు చేసే రక్తదానంతో ఎంతో మంది పేద రోగులకు ప్రాణాపాయ స్థితిలో మేలు జరుగుతుందని చెప్పారు. అందుచేత నియోజకవర్గ పరిధిలోని యువకులు ఈనెల 21న రక్తదానం చేయడానికి ముందుకు రావాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ జర్జాపు దీప్తి, పట్టణ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, వైసిపి నాయకులు హరిబాలాజీ, మద్దిల గోవిందరావు, పతివాడ శివ ప్రసాద్, కొల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలు మరువలేనివని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేష కృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. మహాత్మాగాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ అనే ఆశయాల కోసం పనిచేసిన మహనీయుడన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొన్న మహోన్నతుడు అని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్ఒ జె.వెంకట్రావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఒ.ప్రభాకరరావు, డిపిఒ బి.సత్యనారాయణ, డిప్యూటీ డిఎంహెచ్ఒ దుర్గా కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం డిప్యూటీ సీఎం రాజన్నదొర పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలు బలిదానం చేసిన గొప్ప మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. ఆయన వెంట పట్టణ అధ్యక్షుడు జర్జాపు సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ పాల్గొన్నారు.

వీరఘట్టం: స్థానిక ఎంఇఒ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ పి.కృష్ణమూర్తి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో కె.గౌరునాయుడు, వి.అన్నాజీరావు, కె.విజయ్‌కుమార్, కెటివి పోలి నాయుడు, సంభోర, గంగాధర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక టిడిపి కార్యాలయం వద్ద మండల కన్వీనర్ కె.వి. కొండయ్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక రాష్ట్రం కోసం చేసిన ప్రాణ త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, అరకు పార్లమెంట్ బిసి సెల్ అధికార ప్రతినిధి కిమిడి రామరాజు, టిడిపి సీనియర్ నాయకులు కొత్తకోట విశ్వనాథ్, సింహాచలం, రాజేష్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

బలిజిపేట : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు స్థానిక టిడిపి కార్యాలయంలో అరకు పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్చార్జి మజ్జి అప్పారావు సమక్షంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బోగా రామారావు సర్పంచ్ దూడి భాస్కరరావు, దిబ్బ శ్రీనివాసరావు, రైతు కార్యదర్శి దోమాధర సత్యం నాయుడు, కొవ్వాడ శ్రీనివాసరావు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: వెంకంపేట వీధి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం. పరాంకుశం నాయుడు ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేట: మండలంలోని కిల్లాడ గ్రామంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి టిడిపి నియోజకవర్గ ఇంచార్జి నిమ్మక జయకృష్ణ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిని నాయకులు ఆరిక సువర్ణ, బిడ్డిక అప్పారావు, వరలక్ష్మి, కూరంగి సుందరరావు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



బలిజిపేట : పొట్టి శ్రీరాములుకు నివాళ్లు అర్పిస్తున్న టిడిపి నాయకులు

ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపులు ప్రారంభం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ధాన్యం కొనుగోలు నగదు చెల్లింపులు ప్రారంభమయ్యాయని జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ధాన్యం కొనుగోలుపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, నాణ్యతా ప్రమాణాలు పరిశీలనకు పరికరాలు అందించామని చెప్పారు. జిల్లాలో రూ.27.15 కోట్ల విలువ గల 13310.64 మెట్రిక్ టన్నుల ధాన్యం 2,344 మంది రైతుల నుంచి కొనుగోలు చేశామని చెప్పారు. ఇప్పటి వరకు రూ.8.69 కోట్లను 844 మంది రైతులకు చెల్లింపు చేశామని తెలిపారు. మిగిలిన మొత్తాన్ని చెల్లించే ప్రక్రియలో ఉన్నామన్నారు. సేకరించిన ధాన్యం గిద్దంగుల్లో నిల్వకు చర్యలు తీసుకుంటామన్నారు. బలిజిపేట వేర్ హౌస్ గోడౌన్‌లో 5వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వకు ఎఫ్‌సిఐ అనుమతి ఇచ్చారన్నారు. జిల్లా నుంచి దశల వారీగా 50వేల మెట్రిక్ టన్నుల బియ్యం ఎఫ్‌సిఐకు ఇవ్వడానికి అనుమతించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ దేవుల నాయక్, డిఎస్ఒ కె.వి.ఎల్.ఎన్.మూర్తి, రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు కొత్తకోట రమేష్, వైస్ ప్రెసిడెంట్ ఉదయ భాను, పలువురు రైస్ మిల్లర్ల యజమానులు, తదితరులు, పాల్గొన్నారు

19న భవన నిర్మాణ కార్మిక సంఘం మహాసభ

ప్రజాశక్తి -సీతనగరం

ఈనెల 19న భవన నిర్మాణ కార్మిక సంఘం మూడో మండల మహాసభ జరుగుతుందని మండల అధ్యక్ష కార్యదర్శులు ఆర్.శంకరరావు, ఆర్.రాము, టి.రమేష్ తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎదుట కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడేళ్లలో చేసిన పోరాటాలు, సాధించిన ఫలితాలు, అనుభవాలను తీసుకొని నూతన కమిటీని ఎన్నుకొని భవిష్యత్తు కర్తవ్యాలు చర్చించనున్నట్టు తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యల పట్ల జరిగే ఈ మహాసభలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఫలించిన ఎస్ఎఫ్ఐ పోరాటం

సప్లిమెంటరీ ఫీజు ప్రభుత్వ బాలికల పాఠశాలలోనే చెల్లించాలి

ప్రజాశక్తి -కలెక్టరేట్

ఆర్‌సిఎం బాలుర పాఠశాలలో పదో తరగతి ఫెయిలై సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే విద్యార్థులు ఫరీక్షా ఫీజులు స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ గురువారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ స్థానిక ఆర్‌సిఎం బాలుర, బాలికల ఎయిడెడ్ విద్యాసంస్థలు ప్రభుత్వ మూసివేసి 8 నెలలు గడిచినప్పటికీ సప్లిమెంటరీ పరీక్షలు రాయాలనుకునే టెన్త్ విద్యార్థులకు ప్రత్యామ్నాయం విద్యాశాఖ అధికారులు చూపించకపోవడంతో డిసెంబర్ 12న బాధిత విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ నాయకులు డిఇఒ, కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపిన విషయం విదితమే. దీనిపై స్పందించిన జాయింట్ కలెక్టర్ వెంటనే రాష్ట్ర యంత్రాంగంతో చర్చించి ఫీజులు ఎక్కడ చెల్లించాలో ప్రత్యామ్నాయ మార్గాలపై చర్చించి గురువారానికి ప్రభుత్వ బాలికల పాఠశాలకు ఆదేశాలు జారీ చేశారని, సప్లిమెంటరీ విద్యార్థులంతా ఈనెల 28న గడువు కావున వెంటనే ఫీజులు చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలని కోరారు. దీనిపై స్పందించి ఆలస్యమైన విద్యార్థులకు ప్రత్యామ్నాయం చూపిన విద్యాశాఖ అధికారులకు, కలెక్టరుకు విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపారు.



మహాసభల కరపత్రాన్ని విడుదల చేస్తున్న మున్సిపల్ కార్మికులు

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి- సాలూరు

ఈ నెల 20,21,22 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టి.శంకర్, సహాయ కార్యదర్శి టి.రాముడు కోరారు. గురువారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో వున్న 2కోట్ల మంది ప్రజలకు సేవలందిస్తున్న కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. కరోనా సమయంలో ప్రాణాలకు సైతం తెగించి కార్మికులు సేవలందించారని గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు విజయ, స్వప్న పాల్గొన్నారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రసవానికి ఏడు రోజులు ముందుగా హైరిస్క్ గర్భిణీలను గుర్తించి జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలు, పాఠశాలల్లో ఉన్న 10 నుంచి 19 ఏళ్ల విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త హీనత లోపం లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త నుండి సంపద కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. క్లాప్ మిత్రా జీతాలు సకాలంలో చెల్లించాలని అన్నారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జెసి ఒ.ఆనంద్, డిఆర్ఒ జె.వెంకటరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పై దృష్టి సారించాలి

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఇన్‌ఛార్జ్ డిఎంహెచ్ఒ దుర్గా కల్యాణి పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో హెమోగ్లోబిన్ పరీక్షలను వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హెమోగ్లోబిన్ పరీక్షలను చేయించుకున్నారు. హెమోగ్లోబిన్ మెరుగు పరుచుటకు గుడ్లు, మాంసాహారం, కేరట్, పచ్చని ఆకుకూరలు, బఠాణీ, చిక్కుడు గింజలు వంటి తీసుకోవాలని ఆమె సూచించారు.

ఆశాల పోస్టుల కుదింపు అమానుషం

- రోగాన్ని నివారించినట్టు ప్రభుత్వాన్ని కూడా నివారించగలం
- కుదింపు వైఖరిపై ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ ఖండన

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఆశాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం కపట మోసం ప్రదర్శించిందని ఇది చాలా అమానుషమని ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు టి.కృష్ణవేణి, ఎం.గౌరి, వి.ఇందిరా, గొర్లి వెంకటరమణ, అన్నారు. 200 మంది ప్రజానీకానికి ఒక వాలంటరీని నియమించిన ప్రభుత్వం, 2,500 మంది ప్రజానీకానికి ఒక ఆశా వర్కర్ ఏ విధంగా వైద్య సేవలు అందిస్తుందో తెలియజేయాలని ప్రశ్నించారు. ఆశా పోస్టుల కుదింపుపై పత్రికల్లో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండిస్తూ స్థానిక సుందరయ్య భవనంలో ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్ణయం ఆశా వర్కర్ల పోస్టుల గుర్తింపుతో పాటు, వారందించే వైద్య సేవలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అన్నారు. ఆర్థిక భారం తగ్గించుకునే పేరుతో ఆశా వర్కర్ల పోస్టును కుదించాలనే ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదని, ఇప్పటివరకు 800 మంది జనాభాకు ఒక ఆశా వర్కర్ మాత్రమే వైద్య సేవలు అందించే వారిని, ఇకపై 2,500 పెంచడం వైద్య సేవకులపై తీవ్ర మానసిక ఒత్తిళ్లకు గురి చేయడమేనని, ఇది చాలా దుర్మార్గమని వాపోయారు. పాదయాత్ర సందర్భంలో వైద్య సేవలకు మొదటి ప్రాధాన్యత ఇస్తామని తెలిపిన జగన్మోహన్ రెడ్డి నేడు జనాభా ప్రాతిపదికన ఖాళీగా ఉన్న పోస్టులను పెంచాల్సింది పోయి కుదించడం చాలా అమానుషమని మండిపడ్డారు. ప్రభుత్వ సేవలు అందించడానికి, ఓట్ల చేర్పింపు లెక్కింపులకు ప్రతి 50 కుటుంబాల్లో ఉన్న 200 మంది ప్రజానీకానికి ఒక వాలంటరీ నియమించినప్పుడు, ఒక్క ఆశ వర్కర్ 2500 మంది ప్రజానీకానికి వైద్య సేవలు అందించడం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. కరోనా సమయంలో మహమ్మారిని ఎదిరించి గిరిశిఖర ప్రాంతాలకు వెళ్లి సేవలు అందించిన ఘనత ఆశా వర్కర్లదని, అటువంటి వారిపట్ల రాష్ట్ర ప్రభుత్వం ఈ కుదింపు నిర్ణయం ప్రక్రియ అనుసరించడం చాలా దౌర్భాగ్యమని, దీన్ని బట్టి వైద్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఎంత శ్రద్ధ వహించిందో స్పష్టంగా అర్థమవుతుందని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి కుదింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని లేకుంటే రోగాన్ని నివారించినట్టు ప్రభుత్వాన్ని కూడా నివారించగలమని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు గౌరి

17న సెంచూరియన్ స్నాతకోత్సవం

గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ రాక

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయం ద్వితీయ స్నాతకోత్సవాన్ని ఈనెల 17న ఘనంగా నిర్వహించనున్నట్లు వైస్ ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషన్ హరిచందన్ వస్తున్నట్లు తెలిపారు. గురువారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. 17న సాయంత్రం ఈ వేడుకలు ప్రారంభమవుతాయని తెలిపారు. గౌరవ అతిథిగా కేంద్ర ప్రభుత్వ అదనపు కార్యదర్శి ఎం.సేవలనాయక్ (ఐఎఫ్ఎస్) వర్శిటీ ఛాన్సలర్ డాక్టర్ డీబి ప్రసన్న పట్నాయక్ హాజరవుతారని వివరించారు. కార్యక్రమంలో భాగంగా టాప్ ర్యాంకులో నిలిచిన విద్యార్థులు 10మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేస్తామని తెలిపారు. ప్రొఫెసర్ శాంతమ్మ ప్రోత్సాహంతో ఒక పేద విద్యార్థికి రూ.10వేలు నగదు బహుమతి అందజేస్తామని వివరించారు. ఇంజినీరింగ్, పారా మెడికల్ సైన్సెస్‌కు సంబంధించి వివిధ బ్రాంచ్‌లలో టాపర్లకు గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకాలు అందజేస్తామన్నారు. వచ్చే ఏడాది నుంచి ద్వంద్వ డిగ్రీలు (డ్యుయల్) అందజేయనున్నావ న్నారు. దీనికి సంబంధించి వెస్టెర్న్ సిడ్నీ యూనివర్శిటీతోను, న్యూజిలాండ్ యూనివర్శిటీలతోను చర్చలు జరిగాయన్నారు. విద్యార్థులు ఇన్ స్టా మనీ యాప్ రూపొందించారని, దీంతోపాటు విద్యార్థులు విమానం డిజైన్ తయారు చేస్తున్నారని వివరించారు. వర్శిటీ అధ్యాపక బృందమంతా కలిసి ప్రత్యేక విమానాన్ని తయారు చేస్తున్నారని, దీన్ని తమ వర్శిటీ పేటెంట్‌తో విడుదల చేయాలని ఆలోచన చేస్తున్నామని చెప్పారు. అనంతరం స్నాతకోత్సవ ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, డీన్ డాక్టర్ కృష్ణమూర్తి, డీన్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, డీన్ సన్నీ డియోల్, డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

17న పింఛనర్ల సమావేశం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

స్థానిక రిటైర్డ్ ప్రభుత్వ పింఛనర్ల సమావేశ మందిరంలో ఈనెల 17న విశ్రాంత ప్రభుత్వ పింఛనుదార్ల సమావేశం ఉందని, ఆ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంట జగన్నాధం నాయుడు, దొడ్డంకి గణపతిరావు తెలి పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిల భారత పింఛనుదార్ల దినోత్సవం సందర్భంగా శని వారం ఈ వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో కలెక్టర్ నిశాంత్‌కుమార్, స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు, మున్సిపల్ ఛైర్పర్సన్ బోను గౌరీశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కావున పెన్షనర్లందరూ హాజరుకావాలని కోరారు.

మాజీ సిఎస్ సమీర్ శర్మ 17న రాక

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి శమీర్ శర్మ ఈనెల 17న విజయనగరం జిల్లాకు రానున్నారు. అక్కడి కలెక్టరేట్‌లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. సంబంధిత విభాగాల అధికారులంతా హాజరు కావాలని విజయనగరం కలెక్టర్ సూచించారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ హేమలత

ఆర్‌బికె సందర్శన

సీతానగరం : మండలంలోని మరిపివలస రైతు భరోసా కేంద్రాన్ని పార్వతీపురం ఎడిఎ కె.హేమలత గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం నేరుగా వారి అకౌంట్లో చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఆర్‌బికె ద్వారా ధాన్యాన్ని సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ఎస్.అవినాష్, రెవెన్యూ వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాల్సిందే

పాలకొండ రూరల్ : మండలంలోని నవగాం, డోలమడ సచివాలయాలను ఎంపిడిఒ దొంక త్రినాధులు గురువారం సందర్శించారు. సిబ్బంది హాజరుతోపాటు రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలన్నారు. అనంతరం కొత్త పింఛన్ల జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

రహదారి నిర్మాణ పనుల పరిశీలన

కురుపాం : మండలంలో వలంగి పంచాయతీ లిక్కిడి నుంచి తొలుముగూడ వరకు జరుగుతున్న రహదారి నిర్మాణ పనులను ఎఎంసి మాజీ ఛైర్మన్ ఎస్.వెంకటరావు గురు వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి సౌకర్యం లేనటువంటి ఈ గ్రామానికి ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ప్రత్యేక చొరవ తీసుకొని రూ.10లక్షల నిధులతో రోడ్డు మంజూరు చేయించి గ్రామస్తులకు రహదారి సౌకర్యం కల్పించి నందుకు గిరిజన ప్రజానీ కానికి ధన్య వాదాలు తెలుపు తున్నా మన్నారు. కార్యక్రమం లో మాజీ సర్పంచు లు కె.అప్పల స్వామి, కె.అర్జున్, వైసిపి నాయకులు కె.మధు, పి.చిన్నారావు తదితరు లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఎంసి మాజీ ఛైర్మన్ వెంకటరావు

విధులకు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కొమరాడ : సచివాలయ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు అన్నారు. మండలంలోని చోళ్ల పదం, ఉలిపిరి గ్రామ సచివాలయాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల్లో హాజరు పట్టికతో పాటు వివిధ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉద్యోగులకు ఉందని స్పష్టం చేశారు. ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాల్సిన అవసరం ఉందన్నారు. విధులకు సకాలంలో హాజరు కాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు అన్ని సేవలు అవగాహన కల్పించాలని తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

కురుపాం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతి కుటుంబానికి ఇళ్లు మంజూరు చేస్తుందని, కావున అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ అన్నారు. గురువారం మండలంలో నీలకంఠాపురం పంచాయతీ సచివాలయం వద్ద సర్పంచ్ ఎ. మన్మధరావు ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లు లేనటువంటి కుటుంబాలు తప్పనిసరిగా హౌసింగ్ సిబ్బందికి దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామని, కావున ఈ అవకాశాన్ని ప్రతి లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం నీలకంఠాపురం, మొండిఖల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఒపి, రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, వసతి సౌకర్యాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు.



ధర్నా చేస్తున్న కూలీలు

ఉపాధి పనులు కల్పించాలని ధర్నా

సీతానగరం : వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు వెంటనే కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని నిడగల్లు సచివాలయం వద్ద ఉపాధి కూలీలతో గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనుల్లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఉపాధి పనులు కల్పించాలని అన్నారు. గ్రామంలో పనుల్లేక వలసలు వెళ్తున్నారని, వీటిని అరికట్టాలని కోరారు. తక్షణమే అధికారులు స్పందించి ఉపాధి పనులు కల్పించాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యదర్శి తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని వామసిలో ఎల్విన్ పేట పోలీసులు నాటు సారా స్థావరాలపై గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా నాటు సారా అమ్మకాలు చేపడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద ఉన్న 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు. అలాగే గ్రామ పరిసర ప్రాంతాల్లో నాటు సారా తయారీకి వినియోగిస్తున్న బెల్లం ఊటను ధ్వంసం చేశారు. గ్రామాల్లో ఎవరైనా నాటు సారాను అక్రమంగా తయారు చేసినా, అమ్మకాలు చేపట్టినా వారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు.

రైతు సంక్షేమ ధ్యేయం : ఎంపిపి

గుమ్మలక్ష్మీపురం : రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపిపి కె.దీనమయ్య అన్నారు. మండలంలోని ఇరిడి రైతు భరోసా కేంద్రం వద్ద జిసిసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు దళారీల బారిన పడకుండా ఉండేందుకు ఆర్‌బికెలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్‌బికెలో రైతులకు పంటలపై సలహాలు, సూచనలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్, సర్పంచ్ కద్రక వాసుదేవరావు పాల్గొన్నారు.

వైసిపి పాలనలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

వైసిపి మూడున్నరేళ్ల పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు నిత్యవసర ధరలను అమాంతంగా పెంచడంతో ప్రజలు ఇదేం కర్మ అంటూ ప్రశ్నిస్తున్నారని కురుపాం నియోజకవర్గం టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి అన్నారు. మండలంలోని నోంద్రుకోనలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో టిడిపి హయంలో ఏర్పాటు చేసిన వైటిసి కేంద్రాలను మూసివేశారని అన్నారు. రైతు సంక్షేమ ప్రభుత్వమని చెప్పుకుంటున్న జగన్ సర్కారు గిరిజన రైతుల నుంచి నేటి వరకు ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేదన్నారు. గిరిజనుల పండించే పంటలకు కూడా కనీసం మద్దతు ధర లేదన్నారు. ఏ రకంగా చూసినా గిరిజన సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ప్రజల కష్టాలు తీరాలంటే టిడిపిని గెలిపించాలని కోరారు. అనంతరం. గిరిజనులతో కలిసి ఇదేం కర్మ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండలరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



సాలూరు : ఇదేంకర్మలో భాగంగా ఇంటింటి ప్రచారం చేస్తున్న సంధ్యారాణి

పార్వతీపురం టౌన్ : వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగిపోతున్నారని మాజీ ఎమ్మెల్సీ ద్వారపూడి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు అన్నారు. ఇదేమిఖర్మ కర్మ ఈ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ ద్వారపూడి శ్రీదేవి, టిడిపి పట్టణ, మండల నాయకులతో కలిసి పట్టణంలోని మూడోవార్డు వివేకానంద కాలనీలో పర్యటించారు. వార్డు ప్రజలను కలిసి వైసిపి ప్రభుత్వంలో జరుగుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరు: సిఎం జగన్ పాలనతో రాష్ట్ర అభివృద్ధి తిరోగమనంలో ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి జి.సంధ్యారాణి ఆరోపించారు. ఇదేం కర్మ మనరాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఒకటో వార్డులో ఆమె పర్యటించారు. ఇంటింటికీ తిరిగి జగన్ పాలన సంక్షోభ పాలనకు దారి తీస్తోందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్, పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతి రావు, కౌన్సిలర్ కె.వరలక్ష్మి, పట్టణ నాయకులు కె.గౌరీశంకరరావు పాల్గొన్నారు.

కురుపాం : ఆంధ్ర రాష్ట్రం బాగుండాలంటే టిడిపి అధికారంలోకి రావాలని ఆయన పార్టీ తెలుగు యువత అధ్యక్షులు వావిలపల్లి దివాకర్ అన్నారు. గురువారం గరుగుబిల్లి మండలం వల్లరిగోడబలో స్థానిక సర్పంచ్ రౌతు గోవిందరావు ఆధ్వర్యంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో ఆయన హాజరై గడపగడపకు వెళ్లి ప్రజల సమస్యలు, ప్రభుత్వం పై ప్రజాభిప్రాయాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెసిపి ప్రభుత్వ హయాంలో ప్రజలంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. నిత్యావసర సరుకులతో సహా ధరలు ఆకాశానికి అంటుతున్నాయని, సామాన్యుడు బతకడం కష్టంగా ఉంటూ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పూర్తిగా లేవని, కావున ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వల్లరిగుడబ వైస్‌సర్పంచ్ భుసాల రాము, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం : నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

సీతంపేట : మండలంలోని కిల్లాడ పంచాయతీ గాడిదపాయి, పొంగళం గూడ, జయపురం, జయపురం గూడ, తాడిపాయి గిరిజన తండాల్లో గురువారం ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రభుత్వ హయాంలో ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షులు ఆరిక సువర్ణ, నాయకమ్మగూడ సర్పంచ్ బిడ్డిక అప్పారావు, వరలక్ష్మి, కూరంగి సుందరరావు, మండంగి భూషన్, సునీల్, మాజీసర్పంచ్ బిడ్డిక స్వామినాయుడు, సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంటిపేటలో గడపగడపకు...

సీతానగరం : మండలంలోని అంటిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరాలతో కూడిన బుక్లెట్లను అందచేసి వారు ప్రభుత్వం నుంచి పొందుతున్న సంక్షేమ పథకాలు సవ్యంగా అందుతున్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండీ ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు అందలేకుంటే వాటి వివరాలను అడిగి తెలుసుకు న్నారు. అలాగే గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకు న్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరికి మహేష్, ఉప సర్పంచ్ బి.తిరుపతి రావు, ఎంపిటిసి సభ్యులు ఎస్.నిర్మల, మాజీ జెడ్పీటీసీ అంబటి కృష్ణంనాయుడు, వైసిపి సీనియర్ నాయకులు డి.దానబాబు, స్టేట్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు, పాల్గొన్నారు.

సాలూరు: గడపగడపకూ ప్రభుత్వంలో భాగంగా పట్టణంలోని 13వార్డు బోని వీధి, జూనియర్ కళాశాల రోడ్‌ల్లో డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులై వుండీ ఏదైనా కారణం తో సంక్షేమ పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాల ద్వారా మేలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఛైర్‌పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, వైస్‌ఛైర్మన్లు వంగపండు అప్పలనాయుడు, జర్జాపు దీప్తి, కౌన్సిలర్లు హరి అప్పలకొండ, గొర్లి వెంకటరమణ, రాపాక మాధవరావు, పప్పల లక్ష్మణరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకష్ణ, వైసిపి నాయకులు హరి బాలాజీ, మద్దిల గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావు, ఎఇ సూరి నాయుడు, టౌన్ ఎస్ఐ పాపారావు పాల్గొన్నారు.



డిప్యూటీ సిఎంకు ఫొటోను బహూకరిస్తున్న నాయకులు

దోమలు బాబోయ్!

ప్రజాశక్తి -వీరఘట్టం

ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుధ్యం మెరుగుపడాలి. అయితే మండలంలోని ప్రతి గ్రామంలోనూ ఎక్కడికక్కడ చెత్తాచెతాదారం తాండవిస్తుంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. దోమ కాటుబారినపడి అనేక మంది డెంగీ, మలేరియా, ఫైలేరియా తదితర వ్యాధుల బారినపడి వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి కారణం గ్రామాల్లో అపారిశుధ్యమేనని గ్రామస్తులు, వైద్యాధికారులు చెదుతున్నారు. మండల కేంద్రమైన వీరఘట్టంతో పాటు ఎం.రాజపురం, నడుకూరు, గడగమ్మ, పివిఆర్ పురం తదితర గ్రామాల్లో ఎప్పటికప్పుడు కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వీటిని పరిశుభ్రం చేయాల్సిన పంచాయతీల అధికారులు పట్టించుకోకపోవడంతో దోమలు మరింత వ్యాప్తి చెంది ప్రజలను అనారోగ్యానికి గురి చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పివిఆర్‌పురం కాలువలో పేరుకు పోయిన మురుగునీరు

అపారిశుధ్యమే కారణమంటున్న ప్రజలు



వీరఘట్టం ప్రధాన రహదారి కాలువలో మురుగు నీరు

చలివేంద్రిలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్రిలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి జి.ప్రదీప్ కుమార్ 70 మందికి వైద్యతనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ శాంతకుమారి, ఎఎన్ఎం పైడితల్లి, 104 టెక్నీషియన్ దినేష్, పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలోని ఇప్పలవలస, పాపమ్మవలసలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. వైద్య సిబ్బంది చేపట్టిన ఆరోగ్య తనిఖీలు, రక్త పరీక్షలు పరిశీలించారు. ముఖ్యంగా బిపి, షుగరు, హీమోగ్లోబిన్ పరీక్షలు చేసి గర్భిణీలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కల్పించారు. అనంతరం కాలేయ వ్యాధితో బాధపడుతున్న రోగిని పరిశీలించి తగు ఆరోగ్య సూచనలు చేశారు. కదల్లేని స్థితిలో ఉన్న రోగులను ఎప్పటికప్పుడు గృహ సందర్శనలు చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నిహారిక, ఎంపిటిసి సభ్యులు గుల్ల శంకరరావు, వైద్య సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్ పాల్గొన్నారు.



సీతానగరం: రోగులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు

హైరిస్క్ గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రసవానికి ఏడు రోజులు ముందుగా హైరిస్క్ గర్భిణీలను గ్రామాల్లో గుర్తించి జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలు, పాఠశాలల్లో ఉన్న 10 నుంచి 19 ఏళ్ల విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త హీనత లోపం లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. హై రిస్క్ ఉన్న రోగులను గుర్తించి జిల్లా ఆసుపత్రికి తరలించాలన్నారు. చెత్త నుండి సంపద కేంద్రాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. క్లాప్ మిత్రా జీతభత్యాలు సకాలంలో చెల్లించాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. సమావేశంలో జెసి ఒ.ఆనంద్, డిఆర్ఒ జె.వెంకటరావు, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పై దష్టి సారించాలి

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై దష్టి సారించాలని ఇన్ ఛార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. దుర్గా కల్యాణి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం హెమోగ్లోబిన్ పరీక్షలను వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హెమోగ్లోబిన్ పరీక్షలను చేయించుకున్నారు. హెమోగ్లోబిన్ మెరుగు పరుచుటకు గుడ్లు, మాంసాహారం, కేరట్, పచ్చని ఆకుకూరలు, బఠాణీ, చిక్కుడు గింజలు వంటి ఆహార పదార్థాలు తీసుకోవాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో సిపిఒ పి.వీర్రాజు, డిపిఆర్ఒ ఎల్.రమేష్, ఐసిడిఎస్ పిఒ కె.విజయ గౌరి, రక్త నిధి వైద్యులు డా.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని నేడు ధర్నా

ప్రజాశక్తి - కొమరాడ

రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని శుక్రవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు ఎం.శివనాయుడు, ఎం.సింహాచలం, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. కొమరాడ మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఆర్‌బికెల ద్వారా తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని శుక్రవారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివున్నాయుడు, సింహాచలం, మధుసూదనరావు, సూర్యనారాయణ, తాతబాబు పాల్గొన్నారు.



ధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం చేస్తున్న నాయకులు

ఎస్‌టి జాబితాలో చేర్చే యోచనను విరమించాలి

పాచిపెంట: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చే యోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఎపి గిరిజన సంఘం అధ్యక్షులు సూకూరు అప్పలస్వామి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని కోడుమూరు. మెట్టవలస వద్ద గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చంద్రబాబునాయుడు ఇదే ఆలోచన తెస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేశామని, ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి మళ్లీ ఆలోచన చేయడం దుర్మార్గమని విమర్శించారు. గిరిజన సంప్రదాయాలు, ఎలాంటి సంబంధంలేని బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో ఎలా చేరుస్తారని, ఇదే జరిగితే ఆదివాసీలంతా తీవ్రంగా నష్టపోయి విద్య, వైద్యానికి దూరమై ఆదిమానవ కాలంలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కొర్ర కల్యాణ్, ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

ఆర్‌బికె ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సంతనర్సిపురం గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ ఆర్‌బికె ద్వారా ధాన్యం ఇచ్చేందుకు ఎంతమంది రైతులు సిద్ధంగా ఉన్నారని సిబ్బందిని ప్రశ్నించారు. గ్రామంలో ఎన్ని ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు, ధాన్యం ఇచ్చేందుకు ఎంతమంది రైతులు సిద్ధంగా ఉన్నారు, ఎంతమందికి షెడ్యూల్ ఇచ్చారని ఆర్‌బికె సిబ్బందిని ప్రశ్నించారు. అక్కడే ఉన్న పిఎసిఎస్ ఛైర్మన్ కర్రి గోవిందరావుతో పాటు కొంతమంది రైతులు ధాన్యం విక్రయాలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని, అయితే వాటిని తరలించేందుకు వాహనాల్లేవని, వాహనాలు మంజూరు చేయాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. ట్రాన్స్‌పోర్టుపోర్టు వారితో సమావేశం ఏర్పాటు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రైతులు ఇబ్బందులు పడకుండా అన్ని విధాలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సబ్ కలెక్టర్ తో పాటు మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారి బి కష్ణకాంత్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు ఉన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించండి

కొమరాడ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌ను వెంటనే వేయాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయంలో రెండు నెలలుగా కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడంతో విద్యార్థులు ధ్రువపత్రాల కోసం, రైతులు అడంగళ్, ఇతర పత్రాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు పెట్టుకున్న ముటేషన్ కూడా సకాలంలో కంప్యూటర్ ఆపరేటర్ లేకపోవడం వల్ల కాలం ముగిసిపోయి మళ్లీ రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అలాగే వృద్ధాప్య పింఛనుకు సంబంధించిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలకు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించి, మండల ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు.



మాట్లాడుతున్న కొల్లి సాంబమూర్తి

బ్యాంకు సేవలపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని సప్ప గొత్తిలిలో గురువారం విశాఖ గ్రామీణ బ్యాంకు సిబ్బంది బ్యాంకు సేవలపై మహిళలకు, గ్రామస్తులకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బ్రాంచ్ మేనేజర్ జితేంద్రకుమార్ మాట్లాడుతూ బ్యాంకుల లావాదేవీలు, పొదుపు, ఫిక్స్ డిపాజిట్లపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బ్యాంకులో అకౌంట్ ఉంచి పొదుపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంకు మిత్ర ప్రదీప్, వెలుగు సిసి రాజారావు గ్రామస్తులు పాల్గొన్నారు

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి- పాలకొండ రూరల్

పాలకొండ నగర పంచాయతీ పరిధిలో ఏడవ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా పరిసరాలు పరిశుభ్రత అంశాలపై గురువారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. 15,16 వార్డుల్లో సచివాలయ సిబ్బంది కౌన్సిలర్లు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎడ్మిన్ భవాని, వార్డ్ కౌన్సిలర్ కడగల వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న మహిళలు

మరింత ఉన్నత స్థాయికి ఎదగాలి

వైస్ అడ్మిరల్ బిస్వరత్ దాస్ గుప్తా

విజయనగరం రూరల్ : సైనిక స్కూలు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ బిస్వరత్ దాస్ గుప్తా అన్నారు. లోకల్ బోర్డు ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ 133వ సమావేశంలో పాల్గొనేందుకు కోరుకొండ సైనిక పాఠశాలకు గురువారం ఆయన విచ్చేశారు.

అడ్మిరల్‌కు ప్యాలెస్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ కల్నల్ అరుణ్ ఎం.కులకర్ణి స్వాగతం పలికారు. అందుకున్నారు. అనంతరం వార్ మెమోరియల్ వద్ద యుద్ధ వీరులకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు పాఠశాల సీనియర్ డివిజన్ ఎన్‌సిసి క్యాడెట్లు అందించిన స్మార్ట్, కలర్ ఫుల్ గార్డ్ ఆఫ్ ఆనర్‌ను పరిశీలించారు. తదనంతరం అడ్మిరల్ సింగ్ అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశానికి ఎమ్‌పి, లెఫ్టినెంట్ జనరల్ కె.సురేంద్రనాథ్, పివిఎస్ఎం (రిటైర్డు) సభ్యుడు బి.చంద్రశేఖరరావు, ప్రభుత్వ ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి షంషేర్ సింగ్ రావత్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, కలెక్టర్ ఎ.సూర్య కుమారి, ఎయు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణమోహన్, నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ దుర్గా ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. పలు విషయాలపై చర్చించారు. పాఠశాలలో సాధించిన పురోగతి గురించి ప్రిన్సిపల్ కులకర్ణి సభ్యులకు వివరించారు. పాఠశాల చేపట్టిన అన్ని ప్రాజెక్టులు, వాటి స్థితిగతుల గురించి కూడా ప్రిన్సిపాల్ బోర్డుకు తెలియజేశారు. సిబ్బంది నిరంతర కృషితో పాఠశాల మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని తాను కోరుకుంటున్నట్లు ఛైర్మన్ తెలిపారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న అడ్మిరల్ బిస్వరత్ దాస్ గుప్తా